సాక్షి కామారెడ్డి

శనివారం । 11 । జనవరి । 2025



ఊడుతున్న పెచ్చులు

నస్రుల్లాబాద్ మండలంలోని ఫకీరా నాయక్ తండాలో గల అంగన్‌వాడీ భవనం శిథిలావస్థకు చేరింది.

- 10లో ▸



రూ. 18 వేల వేతనమివ్వాలి

ప్రతినెలా రూ. 18 వేల గౌరవ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆశావర్కర్లు ఆందోళనలు చేశారు.

- 10లో ▸



వాతావరణం

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత కొన సాగుతుంది.

న్యూస్‌రీల్

సంక్రాంతి సెలవులతో హాస్టళ్లు ఖాళీ



బాన్సువాడ రూరల్: ప్రభుత్వం విద్యాసంస్థలకు సంక్రాంతి సెలవులు ప్రకటించింది. శనివారం నుంచి 17వ తేదీ వరకు సెలవులు ఇచ్చింది. దీంతో హాస్టళ్లలో ఉంటూ చదువుకుంటున్న విద్యార్థులు శుక్రవారమే ఇంటి బాటపట్టారు.

రెండో విడత నీటి విడుదల



నిజాంసాగర్: ఆయకట్టు అవసరాల కోసం శుక్రవారం నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి రెండో విడత నీటి విడుదలను ప్రారంభించినట్లు నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. ప్రధాన కాలువకు వెయ్యి క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నామని పేర్కొన్నారు. రైతులు నీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



కామారెడ్డి క్రైం: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పోలీసులు సూచించారు. శుక్రవారం పట్టణ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. నిజాంసాగర్ చౌరస్తా నుంచి కొత్త బస్టాండ్ వరకు ర్యాలీ సాగింది. కార్యక్రమంలో పట్టణ ట్రాఫిక్ ఎస్సై మహేష్, సిబ్బంది, ఎన్‌సీసీ క్యాడెట్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

‘ఆరోపణలు అవాస్తవం’

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : ఆర్టీసీ అధికారులందరూ ఉద్యోగులు, సిబ్బంది సంక్షేమం కోసం, సంస్థ అభివృద్ధి కోసమే పనిచేస్తారని కామారెడ్డి డిపో మేనేజర్ ఇందిర పేర్కొన్నారు. ఇటీవల భిక్కనూరు ఆర్టీసీ పెట్రోల్ బంకులో ట్యాంకర్ డ్రైవర్ నిర్లక్ష్యం వల్ల జరిగిన పొరపాటును అక్కడ పనిచేస్తున్న ఉద్యోగిపై నెట్టేందుకు ఆర్టీసీ అధికారులు ప్రయత్నిస్తున్నారని కొందరు చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. ఆర్టీసీలో ఏ ఉద్యోగిపైనైనా క్రమశిక్షణ చర్యలు తీసుకోవడానికి ఒక నిర్దిష్ట విధానం ఉందని, సంస్థలోని ఉద్యోగులపై ఆ విధివిధానాలను అనుసరించే చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. భిక్కనూరు పెట్రోల్ బంకులో జరిగిన పొరపాటుపై విచారణ నివేదిక ప్రకారం సంస్థ తదుపరి చర్యలు తీసుకుంటుందని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

గ్రాంట్ ఇన్ ఎయిడ్ కోసం దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి అర్బన్: గిరిజనులకు స్వచ్ఛంద సేవలు అందిస్తున్న ఎన్‌జీవోలు, వీవోలకు కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ ద్వారా గ్రాంట్ ఇన్ ఎయిడ్ మంజూరు చేయడానికి ఫిబ్రవరి 15 వరకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి జి.రజిత తెలిపారు. అర్హతగల ఎన్‌జీవోలు, వీవోలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాల్సి ఉంటుందని, వివరాలకు కలెక్టరేట్‌లోని గిరిజన అభివృద్ధి అధికారి కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

చట్టాలపై అవగాహన



భిక్కనూరు: న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం భిక్కనూరు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చట్టాలపై జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రెటరీ, న్యాయమూర్తి టి.నాగరాణి అవగాహన కల్పించారు. విద్యార్థులు మత్తు పదార్థాలు, సోషల్ మీడియాకు బానిసలు కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించేందుకు కృషి చేయాలని అన్నారు. సమాజంలో జరుగుతున్న అకృత్యాలపై జాగ్రత్తగా ఉండాలని న్యాయ సలహాలు పొందడానికి టోల్ ఫ్రీ నంబర్ 15100 కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఎంఈవో రాజగంగారెడ్డి, ప్రధానోపాధ్యాయుడు శ్రీనాథ్ పాల్గొన్నారు.



గోపాల్‌పేటలోని వేణుగోపాలస్వామి ఆలయంలో పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు



స్వామివారికి అభిషేకం చేస్తున్న వేద పండితుడు



జిల్లా కేంద్రంలోని గోపాలస్వామి ఆలయం వద్ద క్యూలో ఉన్న భక్తులు

‘వైకుంఠ’ వైభవం

వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని శుక్రవారం జిల్లాలోని వైష్ణవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మహావిష్ణువును ఉత్తర ద్వారం ద్వారా దర్శించుకునేందుకు భక్తులు వేకువజాము నుంచే ఆలయాల వద్ద బారులు తీరారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయాల పరిసరాలు గోవింద నామస్మరణతో మారుమోగాయి.

– కామారెడ్డి టౌన్

సేవలపై ఫీడ్‌బ్యాక్!

- పోలీసుల పనితీరు తెలుసుకునేందుకు పోలీస్ శాఖ చర్యలు
- ప్రతి ఠాణాలో క్యూఆర్ కోడ్
- సర్కిల్, సబ్ డివిజనల్ కార్యాలయాల్లోనూ ఏర్పాటు

ఠాణాలకు వచ్చేవారితో పోలీసులు వ్యవహరిస్తున్న తీరు, అందిస్తున్న సేవల విషయంలో ప్రజాభిప్రాయం తెలుసుకోవడంపై పోలీస్ శాఖ దృష్టి సారించింది. ప్రజలు తమ అభిప్రాయాన్ని తెలపడానికి వీలుగా నూతన విధానాన్ని అందుబాటులోకి తెచ్చింది. ఇందులో భాగంగా ప్రతి పోలీస్ స్టేషన్‌లో ఐదు చోట్ల క్యూఆర్ కోడ్ స్కానర్లను ఏర్పాటు చేస్తోంది.



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : జిల్లాలోని 23 పోలీస్ స్టేషన్లున్నాయి. వివిధ సేవల కోసం ప్రజలు ఠాణాలకు వస్తుంటారు. అలా వచ్చినవారితో పోలీసులు ఎలా ప్రవర్తిస్తున్నారు, సేవలు ఎలా అందుతున్నాయి అన్న వివరాలు తెలుసుకునేందుకు పోలీస్ శాఖ డిజిటల్ ఫీడ్ బ్యాక్ విధానాన్ని అమలులోకి తీసుకువచ్చింది. ప్రతి పోలీస్ స్టేషన్‌లో ప్రధాన గేటు, సందర్శకుల గది, రిసెప్షనిస్ట్ గది, ఎస్సై రూం, రైటర్ రూంలలో వీటిని ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే ఆయా ఠాణాలకు స్కానర్లను పంపించారు. అలాగే సర్కిల్ ఇన్‌స్పెక్టర్, సబ్ డివిజనల్ అధికారి కార్యాలయాల్లోనూ వీటిని ఏర్పాటు చేయనున్నారు.

పోలీసులు అందించే సేవలపై..

తమ కష్టాలు, సమస్యలపై ఫిర్యాదు చేయడానికి వెళ్లిన వారిని పోలీస్ అధికారులు పట్టించుకోకపోయినా, నిర్లక్ష్యం చేసినా, ఇబ్బందులకు గురిచేసినా ఆ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి ఫీడ్‌బ్యాక్ ఇవ్వవచ్చు. ఫిర్యాదులు, ఎఫ్ఐఆర్, ఈ–చలాన్, పాస్‌పోర్టు ధ్రువీకరణతో పాటు ఇతర అంశాలపై ప్రజలు తమ అభిప్రాయాలను తెలపడానికి స్కానర్లు ఉపయోగపడతాయి. పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన వారు తాము చేసిన ఫిర్యాదుకు సంబంధించి అధికారులు, సిబ్బంది స్పందించిన తీరును స్కాన్ చేసి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లొచ్చు. అలాగే ఎఫ్ఐఆర్‌కు సంబంధించిన అంశాలు, పాస్‌పోర్టు వెరిఫికేషన్ విషయంలో అధికారులు, సిబ్బంది ఎలా వ్యవహరించారో చెప్పుకోవచ్చు. ఇతర అంశాలపైనా తమ ఫీడ్‌బ్యాక్ చెప్పడానికి వీలుంటుంది. క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసిన వెంటనే ఒక ఫాం వస్తుంది. దానిలో వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. ఒక వేళ ఫోన్‌లో టైపింగ్ చేయడం రాని వారు తమ వాయిస్ మెసేజ్ ద్వారా వివరాలను తెలియజేసే అవకాశం కల్పించారు.

పనితీరు ఆధారంగా ర్యాంకులు..

పోలీసుల పనితీరును అధికారులు తెలుసుకునేందుకు డిజిటల్ ఫీడ్‌బ్యాక్ విధానం ఎంతగానో ఉపయోగపడుతుందని భావిస్తున్నారు. ప్రజల నుంచి వచ్చే ఫీడ్ బ్యాక్ ఆధారంగా ఆయా ఠాణాలకు ర్యాంకులు కేటాయించనున్నారు. తమ సమస్యలను చెప్పుకోవడానికి వెళ్తే అధికారులు పట్టించుకోకపోయినా, ఇబ్బంది పెట్టినా.. ఆ విషయాన్ని క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి చెప్పడం మూలంగా వెంటనే ఉన్నతాధికారులు స్పందించే అవకాశాలుంటాయని భావిస్తున్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులను ఇబ్బంది పెడితే వారు క్యూఆర్ కోడ్‌ను వాడుకునే వీలున్న నేపథ్యంలో పోలీసులూ జాగ్రత్తగా వ్యవహరిస్తారన్న అభిప్రాయమూ వ్యక్తమవుతోంది.

గతంలో సిటిజన్ ఫీడ్‌బ్యాక్ సెంటర్..

2017 డిసెంబర్ 31న అప్పటి డీజీపీ మహేందర్‌రెడ్డి కామారెడ్డి జిల్లా పోలీస్ కార్యాలయంలో సిటిజన్ ఫీడ్ బ్యాక్ సెంటర్‌ను ప్రారంభించారు. రాష్ట్రంలో వెస్ట్ జోన్ పరిధిలోని దాదాపు 16 జిల్లాలకు సంబంధించిన సమాచారాన్ని కామారెడ్డి కేంద్రం ద్వారా నిర్వహించేవారు. ఇక్కడి ఫీడ్ బ్యాక్ సిబ్బంది ఆయా జిల్లాల్లో నమోదైన ఎఫ్ఐఆర్‌లకు సంబంధించిన ఫిర్యాదుదారుల నంబర్లను తీసుకుని వారికి కాల్ చేసి మాట్లాడేవారు. వారు ఇచ్చిన సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేసేవారు. రెండుమూడేళ్లు ఇక్కడి నుంచే ఫీడ్‌బ్యాక్ సెంటర్ సేవలు నడిచాయి. తర్వాత రాష్ట్రమంతటికీ కలిపి డీజీపీ కార్యాలయం నుంచి నిర్వహించడం ప్రారంభించారు. కొంతకాలం తర్వాత సిటిజన్ ఫీడ్ బ్యాక్ అంశం మరుగున పడిపోయింది.

“ ప్రజల అభిప్రాయాన్ని తెలుసుకునేందుకు..

పోలీసుల పనితీరుపై ప్రజల అభిప్రాయాన్ని తెలుసుకునేందుకు రాష్ట్ర పోలీస్ శాఖ కొత్త విధానాన్ని అమలులోకి తీసుకువచ్చింది. ప్రతి పోలీస్ స్టేషన్‌లో ప్రజలకు సులభంగా కనిపించే ప్రాంతాలలో క్యూఆర్ కోడ్ స్టిక్కర్లను అందుబాటులో ఉంచుతున్నాం. ప్రజలు తమ అభిప్రాయాలను క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి చెప్పవచ్చు.

– సింధుశర్మ, ఎస్పీ, కామారెడ్డి

‘ఎమ్మెల్సీ’ వేడి షురూ

అభ్యర్థులను ప్రకటించిన బీజేపీ

- పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా అంజిరెడ్డి
- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా కొమరయ్య
- కాంగ్రెస్ మద్దతు కోసం ప్రయత్నిస్తున్న అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి, మదనం గంగాధర్
- బీఆర్ఎస్ నుంచి పోటీకి బీఎన్ రావు ప్రయత్నాలు





సి అంజిరెడ్డి



మల్క కొమరయ్య



మదనం గంగాధర్



డాక్టర్ బీఎన్ రావు



అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : ఆదిలాబాద్–నిజామాబాద్–కరీంగనర్–మెదక్ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీల ఎన్నికల వేడి షురూ అయ్యింది. బీజేపీ అభ్యర్థులను ప్రకటించింది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరువుకు చెందిన సి.అంజిరెడ్డిని, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పెద్దపల్లి జిల్లా బంధంపల్లికి చెందిన మల్క కొమరయ్యను ప్రకటించారు. బీఏ మ్యాథ్స్ పట్టభద్రుడైన అంజిరెడ్డి పారిశ్రామికవేత్త. ఎస్ఆర్ ట్రస్ట్ ద్వారా 20 ఏళ్లుగా గ్రామాల్లో తాగునీటి సరఫరా చేస్తున్నారు. పేద విద్యార్థులకు మెరుగైన విద్యనందించేందుకు కృషి చేస్తున్నారు. అంజిరెడ్డి సతీమణి గోదావ రి బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలిగా ఉన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి బీఈ సివిల్ ఇంజినీరింగ్ పట్టా అందుకున్న మల్క కొమరయ్య హైదరాబాద్‌లో ఢిల్లీ పబ్లిక్ స్కూల్ స్థాపించారు. పెద్దపల్లి, నిర్మల్, హైదరాబాద్‌లో పల్లవి విద్యాసంస్థలను నిర్వహిస్తున్నారు. కొమరయ్య గత లోక్‌సభ ఎన్నికల్లో మల్కాజ్‌గిరి టికెట్టు కోసం ప్రయత్నించారు. టికెట్ రాకపోవడంతో ఈటల రాజేందర్ గెలుపు కోసం కృషి చేశారు. ప్రధాన పార్టీల నుంచి మొదటగా బీజేపీ తన అభ్యర్థులను ప్రకటించడంతో ఎమ్మెల్సీ ఎన్నికల వేడి మొదలైంది. ఈ నియోజకవర్గం పరిధిలో బీజేపీకి నలుగురు ఎంపీలు, ఏడుగురు ఎమ్మెల్యేలు ఉన్నారు. ఇది తమకు కలిసొస్తుందని బీజేపీ అభ్యర్థులు భావిస్తున్నారు.

- కరీంనగర్‌కు చెందిన అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి పట్టభద్రుల ఎమ్మెల్సీ కోసం రెండు నెలలుగా స్వతంత్రంగా ప్రచారం చేస్తున్నారు. నియోజకవర్గంలో ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు ఏర్పాటు చేశారు. సోషల్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఇక డీఎస్పీ ఉద్యోగాన్ని వదిలేసి వచ్చిన ఆర్మూర్‌కు చెందిన మదనం గంగాధర్ సైతం పట్టభద్రుల ఎమ్మెల్సీ బరిలో దిగేందుకు రెండు నెలలుగా ప్రచారం చేస్తున్నారు. బిచ్చమెత్తుకునే స్థాయి నుంచి మొదలై బాలకార్మికుడిగా పనిచేసి డీఎస్పీ స్థాయి వరకు వచ్చిన గంగాధర్ స్వచ్ఛందంగా ఉద్యోగాన్ని వదిలేశారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్–1 పేపర్ లీకేజీ నిందితులను పట్టుకునే విషయంలోనూ గంగాధర్ క్రియాశీలక పాత్ర పోషించారు. అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి, మదనం గంగాధర్ కాంగ్రెస్ పార్టీ మద్దతు కోసం గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు.
- కరీంనగర్‌కు చెందిన డాక్టర్ బీఎన్ రావు ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశారు. బీఎన్ రావు ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. పలు ప్రాంతాల్లో క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్టులు, గ్రామాలలో వైద్య శిబిరాలు నిర్వహించారు. ప్రతి నెల కొందరికి కీళ్ల మార్పిడి చేస్తున్నారు. పలు విద్యాసంస్థల్లో వాటర్ ప్లాంట్‌లు ఏర్పాటు చేశారు. బీఎన్ రావు బీఆర్ఎస్ తరఫున పోటీ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు.

పండుగ పూట పస్తులేనా?

- బల్దియా కార్మికులకు మూడు నెలలుగా అందని వేతనాలు
- పాలకులు స్పందించాలని వినతి

కామారెడ్డి టౌన్: బల్దియాలో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు మూడు నెలలుగా వేతనాలు అందడం లేదు. దీంతో కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఈనెల 11 నుంచి 15వ తేదీ వరకు సంక్రాంతి సెలవులు కావడంతో పండుగకు కూడా వేతనాలు అందే పరిస్థితి లేదు.

కామారెడ్డి బల్దియాలో సానిటేషన్, వాటర్‌వర్క్స్, వీధి దీపాలు, కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్ కార్మికులు కలిపి మొత్తం 496 మంది విధులు నిర్వహిస్తున్నారు. వీరందరికి అక్టోబర్ నుంచి వేతనాలు రావడం లేదు. సానిటేషన్ విభాగంలో పనిచేస్తున్న కొందరు కార్మికులకు మాత్రం అక్టోబర్ నెల వేతనం అందింది. మిగతావారికి మూడు నెలల వేతనం పెండింగ్‌లో ఉంది. పాలకులు స్పందించి వేతనాలు అందేలా చూడాలని కోరుతున్నారు.

‘లింకేజీ’ లక్ష్యం నెరవేరేనా..?

- రూ. 802 కోట్ల రుణాలు ఇవ్వాలన్నది లక్ష్యం
- ఇప్పటివరకు ఇచ్చింది రూ. 613 కోట్లే..
- గడువులోగా లక్ష్యాన్ని చేరుకుంటామంటున్న అధికారులు



సిబ్బందితో సమావేశం నిర్వహిస్తున్న డీపీఎం సురేశ్‌కుమార్ (ఫైల్)

నాగిరెడ్డిపేట: జిల్లాలో 17,058 మహిళా సంఘాలలో 1.78 లక్షల మంది సభ్యులున్నారు. వీరికి ఈ ఆర్థిక సంవత్సరంలో రూ. 802 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు ఇవ్వాలన్నది లక్ష్యం. కాగా ఇప్పటి వరకు 9,035 సంఘాలకు రూ. 613.71 కోట్ల రుణాలను మాత్రమే ఇచ్చారు. 76 శాతమే లక్ష్యాన్ని చేరుకున్నారు. లక్ష్యాన్ని చేరుకునేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

ప్రత్యేక సమావేశాల నిర్వహణ

జిల్లాలో బ్యాంకు లింకేజీ రుణాల లక్ష్యాన్ని చేరుకునేందకు జిల్లా సెర్ప్ అధికారులు మండలాల్లో ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నారు. ప్రతి మండలంలో బ్యాంకు లింకేజీ రుణాల మంజూరులో వెనకబడిన క్లస్టర్ల సీసీలు, సీఏలతో డీపీఎంలు సమావేశాలు నిర్వహిస్తూ దిశానిర్దేశం చేస్తున్నారు. తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకునేలా మహిళా సంఘాల సభ్యులకు అవగాహన కల్పించాలని సూచిస్తున్నారు.

రుణాలు పొందేందుకు వెనకడుగు

బ్యాంకు లింకేజీ ద్వారా రుణాలు పొందేందుకు గ్రామాల్లోని మహిళా సంఘాల సభ్యులు వెనకడుగు వేస్తున్నారు. వాయిదాల చెల్లింపులో ఇబ్బందులు తలెత్తుతాయనే భయంతో రుణాలు తీసుకునేందుకు ముందుకు రావడం లేదని తెలుస్తోంది. దీంతోపాటు చిన్నచిన్న గ్రామాల్లో వ్యాపారాలు చేసుకునే పరిస్థితి లేకపోవడంతో మహిళలు రుణాలు తీసుకునేందుకు ముందుకు రావడంలేదని తెలుస్తోంది. కాగా గతంలో రుణాలు పొందిన సంఘంలో కొందరు సభ్యులు సకాలంలో అప్పు చెల్లించకపోవడం వల్ల ప్రస్తుతం ఆ సంఘంలోని సభ్యులకు నూతనంగా రుణం ఇచ్చే అవకాశం లేదు. దీంతో రుణమంజూరు లక్ష్యం చేరుకోవడం కష్టమేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

“ లక్ష్యాన్ని చేరుకునేందుకు చర్యలు..

బ్యాంకు లింకేజీ రుణాల లక్ష్యాన్ని గడువులోగా చేరుకునేందుకు చర్యలు తీసుకుంటున్నాం. దీనిపై ఇప్పటికే జిల్లా అధికారులు కిందిస్థాయి సిబ్బందితో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి తగిన సూచనలు ఇచ్చారు. మేం కూడా ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకుని ముందుకు సాగుతున్నాం.

– జగదీశ్ కుమార్, ఏపీఎం, నాగిరెడ్డిపేట

‘పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి’



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి

కామారెడ్డి క్రైం: నవోదయ ప్రవేశ పరీక్ష నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అధికారులకు సూచించారు. పరీక్ష నిర్వహణపై శుక్రవారం కలెక్టరేట్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాంసాగర్‌లోని నవోదయ విద్యాలయంలో ఆరో తరగతిలో ప్రవేశం కోసం ఈనెల 18 న పరీక్ష నిర్వహించనున్నామన్నారు. అభ్యర్థుల కోసం జిల్లాలో 14 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ప్రతి కేంద్రానికి చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ అధికారులు, ఇన్విజిలేటర్లను నియమించామని తెలిపారు. అన్ని కేంద్రాలతో తాగునీరు, విద్యుత్ సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎంతో సమావేశానికి కలెక్టర్

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం కలెక్టర్లతో సీఎం రేవంత్‌రెడ్డి సమావేశమయ్యారు. ఆయన వివిధ అంశాలపై సమీక్షించారు. 26 నుంచి ప్రారంభమయ్యే పథకాలు అర్హులకు అందేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పాల్గొన్నారు.



సీఎంతో సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

క్లుప్తంగా

మానసిక వికాసానికి పుస్తకాలే ఆధారం



భిక్కనూరు: మానసిక వికాసానికి పుస్తకాలే ఆధారమని, విజ్ఞానానికి ఈ పుస్తకాలే దోహద పడతాయని గురుకుల కళాశాల ప్రిన్సిపల్ ఎస్.రఘు అన్నారు. శుక్రవారం కామారెడ్డి జిల్లా సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల భిక్కనూరులో 2002 నుండి 2012లో పనిచేసిన ఫిజికల్ డైరెక్టర్ బీఆర్ నర్సింగ్‌రావు రచించిన ''అల్లకొండ ఊరు ఉత్సవం – ఐదు ఆలయాలకు ప్రసిద్ధి'' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. ఈ పుస్తకం విద్యార్థులకు పూర్వ చరిత్ర గురించి తెలుసుకోవడానికి ఉపయోగపడుతుందని అన్నారు. రచయిత నర్సింగ్ రావు పుస్తకంలోని విషయాల గురించి వివరించారు. కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ఎం.సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ వెంకటేష్ పాల్గొన్నారు.

యువజన కాంగ్రెస్ సేవలు ఆదర్శం



భిక్కనూరు: యువజన కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలు ఎంతో ఆదర్శంగా నిలుస్తున్నాయని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో యంగ్ ఇండియా కే బోల్ సీజన్ కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పలు కార్యక్రమాలు నిర్వహించి బహుమతులను అందజేశారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భీంరెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు వెంకటేష్, పట్టణ అధ్యక్షుడు దయాకర్ రెడ్డి నాయకులు లింబాద్రి, మైపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి రోల్ ప్లే పోటీల్లో ప్రతిభ

కామారెడ్డి రూరల్: దేవునిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు మధ్యప్రదేశ్‌లో జరిగిన జాతీయస్థాయి రోల్‌ప్లే పోటీల్లో ప్రతిభ కనబర్చారు. పాఠశాలకు చెందిన సానియా, రేణుక, హర్షవర్ధన్, నాని, విక్టర్ పాల్, గైడ్ టీచర్, ఎస్కార్ట్ టీచర్ రమేష్‌లతో కూడిన తెలంగాణ టీం పోటీల్లో పాల్గొనేందుకు వెళ్లారు. మత్తుపదార్థాల వినియోగం.. నివారణ అనే అంశంలో ఉత్తమ ప్రదర్శన చేసినందుకు ఎస్‌సీఈఆర్‌టీ ప్రతినిధులు ప్రత్యేకంగా అభినందించారు. ప్రశంసా పత్రాలు కూడా అందజేశారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గంగాకిషన్ తెలిపారు.

అనుమానాస్పదంగా తిరుగుతున్న మహిళపై దాడి

బాన్సువాడ : అనుమానాస్పదంగా తిరుగుతున్న ఓ మహిళపై స్థానికులు దాడి చేసి పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన శుక్రవారం బాన్సువాడ పట్టణంలోని పాత వీక్లీ మార్కెట్ ప్రాంతంలో చోటుచేసుకుంది. బుర్ఖా ధరించిన మహిళ మరో వ్యక్తితో కలిసి అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో పిల్లలను కిడ్నాప్ చేసేవారి భావించి స్థానికులు వారిని పట్టుకునే ప్రయత్నం చేశారు. వారికి చిక్కిన మహిళపై దాడి చేసి పోలీసులకు అప్పగించారు. పోలీసులు సదరు మహిళను విచారిస్తున్నారు. బుర్ఖా ధరించి వచ్చిన మహిళపేరు లక్ష్మిగా గుర్తించినట్లు సమాచారం.

బండపై పడి మహిళ మృతి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని తాండూర్ గ్రామానికి చెందిన చాకలి జమున(45) అనే మహి ళ గురువారం రాత్రి ప్రమాదవశాత్తు బండపై పడి మృతి చెందింది. ఎస్సై మల్లారెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. చాకలి జమున గురువారం రాత్రి బహిర్భూమికి ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి వస్తుండగా, ప్రమాదవశాత్తు కాలుజారి బండపై పడిపోయింది. తలకు తీవ్రగాయాలు కావడంతో జమున అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి కుమారుడు రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఊడుతున్న పెచ్చులు



ఫకీరానాయక్ తండాలో మధ్యలో నిలిచిన అంగన్‌వాడీ భవనం



పెచ్చులూడుతున్న గదిలో నిద్రపోతున్న చిన్నారులు

- ప్రమాదకరంగా ఉన్న అంగన్‌వాడీ భవనంలో పసిపిల్లలకు చదువులు
- బేస్‌మెంట్ స్థాయిలో నిలిచిన కొత్త భవన నిర్మాణం
- పట్టించుకోని అధికార యంత్రాంగం

నస్రుల్లాబాద్(బాన్సువాడ): ఒక్క క్షణం ప్రమాదకర ప్రదేశంలో చిన్నారులను వదిలితేనే భయపడే తల్లిదండ్రులు తమ చిన్నారులను పెచ్చులూడి పడుతున్న భవనంలో వదిలి వెళ్తున్నారు. నస్రుల్లాబాద్ మండలంలోని ఫకీరా నాయక్ తండాలో గల అంగన్‌వాడీ కేంద్రంలో ప్రిస్కూల్ చిన్నారులు 11 మంది, టీహెచ్‌ఆర్ పిల్లలు 9 మంది ఉన్నారు. ఈ భవనం పెచ్చులు ఊడుతూ ప్రమాదకరంగా మారింది. గ్రామంలోని ప్రాథమిక పాఠశాల మూత పడటంతో అందులో అంగన్‌వాడీ కేంద్రాన్ని కొనసాగిస్తున్నారు. ఎప్పుడో నిర్మించిన భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. వర్షాకాలంలో ఊరుస్తూ నీటితో నిండిపోతుంది. అలాంటి భవనంలో అంగన్‌వాడీ కేంద్రం నిర్వహిస్తున్నారు. గాలికే పెచ్చులూడి పడే భవనంలో జరగకూడనిది జరిగితే ఎలా అని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

ముందుకు సాగని పనులు..

ఫకీరా నాయక్ తండా ప్రధాన రహదారికి లోపలికి ఉంటుంది. గతంలో లింగంపల్లి తండాలో ఉండే ఈ గ్రామం ప్రస్తుతం ప్రత్యేక గ్రామ పంచాయతీగా మారింది. ఈ గ్రామంలో నూతన అంగన్‌వాడీ భవనం ఏర్పాటుకు నిధులు కేటాయించారు. కాని అది కాస్తా పాలకుల అలసత్వం కారణంగా మధ్యలోనే నిలిచిపోయింది. ప్రభుత్వాలు మారడంతో నిర్మాణం పూర్తి కాలేదు. అధికార యంత్రాంగం ప్రమాదం జరిగిన తర్వాత జాగ్రత్తలు తీసుకోవడం కంటే ప్రమాదం జరగకముందే మరో భవనంలోకి మార్చడమో లేక కొత్త భవనాన్ని త్వరగా పూర్తి చేసి అందులోకి మార్చడమో చేయాలని చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

కూలడానికి సిద్ధంగా ఉంది

గ్రామంలో ఉన్న అంగన్‌వాడి భవనంలో పెచ్చులూడి పడుతున్నాయి. చాలా రోజుల క్రితం నిర్మించిన భవనం కారణంగా కూలడానికి సిద్ధంగా ఉంది. వర్షాకాలంలో సైతం చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. కొత్త భవనం త్వరగా నిర్మించాలి.

– కడావత్ అరవింద్, ఫకీరా నాయక్ తండా

మధ్యలోనే ఆపేశారు

అంగన్‌వాడి బిల్డింగ్ లేదని కొత్తది కట్టాలని ప్రారంభించారు. కాని అది మధ్యలోనే ఆపేశారు. ఇప్పుడున్న భవనం శిథిలావస్థలో ఉంది. ఆగిపోయిన బిల్డింగ్ పనులు మళ్లీ ప్రారంభించాలి. అలా అయితేనే సురక్షితంగా ఉంటారు.

– రాజు, ఫకీరానాయక్ తండా

ఆశావర్కర్లకు రూ.18 వేల గౌరవ వేతనం ఇవ్వాలి



బాన్సువాడలో ఎమ్మెల్యే పోచారం ఇంటి ఎదుట ధర్నా చేస్తున్న ఆశావర్కర్లు

బాన్సువాడ: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం బాన్సువాడలో ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఇంటి ముందు సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశావర్కర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకులు ఖలీల్ మాట్లాడుతూ.. ఫిబ్రవరిలో జరిగే అసెంబ్లీ సమావేశాల్లో ఆశావర్కర్లకు రూ.18 వేల గౌరవ వేతనం ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.

నిజాంసాగర్(జుక్కల్): సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం జుక్కల్ ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసును ఆశావర్కర్లు ముట్టడించారు. ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అందుబాటులో లేకపోవడంతో తహసీల్దార్ హిమబిందుకు వారు వినతి పత్రం అందజేశారు. సీఐటీయూ నేత సురేశ్ గొండ ఉన్నారు.

ఎల్లారెడ్డి: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సాయిబాబాకు ఆశావర్కర్లు వినతిపత్రం అందజేశారు. ఆశావర్కర్ల సంఘం అధ్యక్షులు మంజుల తదితరులున్నారు.

'పాడి రైతులు వ్యాపారవేత్తలుగా అభివృద్ధి చెందాలి'

కామారెడ్డి అర్బన్: పాడి రైతులు వ్యాపారవేత్తలుగా అభివృద్ధి చెందాలని కామారెడ్డి డెయిరీ కళాశాల అసోసియేట్ డీన్ కేఎస్ ఉమాపతి అన్నారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ, డీఆర్‌డీవోల ఆధ్వర్యంలో పాడి పరిశ్రమ, పాలు, పాల ఉత్పత్తుల తయారీ, విక్రయాలపై డెయిరీ కళాశాల 35 మంది యువ పాడిరైతులకు శిక్షణ ఇచ్చారు. సొంతంగా పాడి ఉత్పత్తులు తయారు చేసే యూనిట్‌లకు 35 శాతం సబ్సిడీ అందిస్తున్నట్టు అధికారులు పేర్కొన్నారు. డెయిరీ అధ్యాపకులు శరత్‌కుమార్, ఆయా శాఖల అధికారులు మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో టీచర్ మృతి



పాల వేణు(ఫైల్)

ఇందల్వాయి: మండలంలోని బీబీపూర్ తండా సమీపంలో 44వ నంబరు జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో జిల్లా కేంద్రానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు పాల వేణు(49) మృతి చెందాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని కేకే తండా ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్న వేణు శుక్రవారం ఉదయం నిజామాబాద్ నుంచి పాఠశాలకు బయల్దేరాడు. బీబీపూర్ తండా సమీపంలోకి చేరుకున్న సమయంలో వేణు నడుపుతున్న ద్విచక్రవాహనం అదుపు తప్పింది. గాయాలపాలైన వేణు చికిత్స నిమిత్తం స్థానికులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. వేణు గతంలో పీఆర్టీయూ మండల అధ్యక్షుడిగా పని చేశారు. ఆయన భార్య సైతం ఉపాధ్యాయ వృత్తిలోనే ఉన్నారు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో నలుగురికి జైలు



ఖలీల్‌వాడి: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో న్యాయస్థానం నలుగురికి జైలుశిక్ష, 16 మందికి జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ ప్రసాద్ శుక్రవారం తెలిపారు. నగరంలోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో 20 మందికి కౌన్సెలింగ్ ఇచ్చిన అనంతరం సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట శుక్రవారం హాజరుపరిచామన్నారు. ముగ్గురికి రెండు రోజుల, ఒకరికి ఒక రోజు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారని, అలాగే 16 మందికి మొత్తం రూ.25,500 జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

నగరంలో రెండు చోట్ల చోరీ

ఖలీల్‌వాడి: నగరంలోని ఒకటో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ఓ వస్త్ర దుకాణంతోపాటు మెడికల్‌లో దుండగులు చోరీకి పాల్పడినట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి శుక్రవారం తెలిపారు. పూసలగల్లీలోని అరుణ ఫ్యాబ్రిక్స్‌లో నుంచి రూ.2.80 లక్షలు అలాగే ఖలీల్‌వాడిలోని ఓ మెడికల్‌లో నుంచి రూ.85 వేలు ఎత్తుకెళ్లారన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు. రెండు చోట్ల ఒకేతరహాలో చోరీ జరిగిందని, ఒకే ముఠాకు చెందిన వారు చోరీకి పాల్పడి ఉంటారని అనుమానించారు.

చెరువులో మహిళ మృతదేహం

రుద్రూర్: మండల కేంద్రంలోని ఊర చెరువులో గ్రామానికి చెందిన జూకంటి శారద(34) అనే మహిళ మృతదేహన్ని స్థానికులు శుక్రవారం గుర్తించారు. చెరువు కట్ట పైనుంచి వెళుతున్న స్థానికులు మృతదేహన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై సాయన్న ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహన్ని బయటకు తీయించారు. గత కొంత కాలంగా శారద ఫిట్స్, కడుపు నొప్పితో బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుందని మృతురాలి తల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అనుమానాస్పదంగా తిరుగుతున్న మహిళపై దాడి

బాన్సువాడ : అనుమానాస్పదంగా తిరుగుతున్న ఓ మహిళపై స్థానికులు దాడి చేసి పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన శుక్రవారం బాన్సువాడ పట్టణంలోని పాత వీక్లీ మార్కెట్ ప్రాంతంలో చోటుచేసుకుంది. బుర్ఖా ధరించిన మహిళ మరో వ్యక్తితో కలిసి అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో పిల్లలను కిడ్నాప్ చేసేవారి భావించి స్థానికులు వారిని పట్టుకునే ప్రయత్నం చేశారు. వారికి చిక్కిన మహిళపై దాడి చేసి పోలీసులకు అప్పగించారు. పోలీసులు సదరు మహిళను విచారిస్తున్నారు. బుర్ఖా ధరించి వచ్చిన మహిళపేరు లక్ష్మిగా గుర్తించినట్లు సమాచారం.

నగరంలో గంజాయి పట్టివేత

- నలుగురు యువకులు, ఓ బాలుడు అరెస్ట్



ఖలీల్‌వాడి: నగరంలోని నాల్గో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ ఇంటిపై దాడి చేసి గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు టౌన్ సీఐ శ్రీనివాసరాజు తెలిపారు. టౌన్ సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. పక్కా సమాచారం మేరకు ఎస్సై శ్రీకాంత్ తన బృందంతో కలిసి వినాయకనగర్‌లోని ఓ ఇంటిపై దాడి చేయగా 461 గ్రాముల గంజాయి పట్టుబడిందన్నారు. నలుగురు యువకులు ఆకాశ్, రోహిత్‌కుమార్, శివరాణా రామతేజ్ రెడ్డి, రాకేశ్‌తోపాటు ఓ బాలుడిని అదుపులోకి తీసుకున్నారన్నారు. వారి వద్ద నుంచి గంజాయితోపాటు ఐదు సెల్‌ఫోన్‌లు, రెండు మోటార్ సైకిళ్లు, ఓ కారు, గంజాయి ప్యాకింగ్‌కు ఉపయోగించే 18 ఖాళీ ప్లాస్టిక్ కవర్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. పట్టుబడిన వారిపై ఎన్‌డీపీఎస్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేశామన్నారు. ఐదుగురిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించామని అన్నారు. తల్లిదండ్రులు, విద్యా సంస్థల బాధ్యులు పిల్లల కదలికలపై దృష్టి సారించాలని కోరారు.

చైనా మాంజా పట్టివేత



ఖలీల్‌వాడి: నగరంలోని రెండో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న పతంగుల దుకాణాలపై ఇన్‌చార్జి సీపీ సింధుశర్మ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ నాగేంద్రచారి ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్, సీసీఎస్ సిబ్బంది దాడి చేశారు. రూ.10వేల విలువైన చైనా మాంజా స్వాధీనం చేసుకున్నారు. చైనా మాంజా నిల్వ చేసిన వారిని రెండో టౌన్ పోలీస్‌స్టేషన్ ఎస్సై యాసిన్ అరాఫత్‌కు అప్పగించారు.దాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ అంజయ్య, సీసీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నగల షాపులో చోరీ : కిలో వెండి అపహరణ



షాపును పరిశీలిస్తున్న ఎస్సై షరీఫ్

డిచ్‌పల్లి: మండల కేంద్రంలోని హేమశ్రీ సిల్వర్ మర్చంట్‌లో దుండగులు గురువారం రాత్రి చోరీకి పాల్పడి కిలో వెండి ఎత్తుకెళ్లారు. షాపు యజమాని శ్రీరాముల లక్ష్మీనర్సయ్య, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. లక్ష్మీనర్సయ్య రోజూలాగే గురువారం రాత్రి 8గంటలకు దుకాణాన్ని మూసివేసి ఇంటికి వెళ్లాడు. శుక్రవారం ఉదయం 10గంటలకు షాపు తెరిచేందుకురాగా, షటర్ తాళాలు పగులగొట్టి కనిపించాయి. షటర్‌ను ఎత్తి చూడగా దుకాణంలోని కౌంటర్‌ను ధ్వంసంచేసి దుండగులు కిలో వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లినట్లు గుర్తించాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా, వారు ఘటనాస్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. సీసీ కెమెరా హార్డ్ డిస్క్‌ను దుండగులు ధ్వంసం చేశారు. బంగారు ఆభరణాలను దాచిన లాకర్‌ను ధ్వంసం చేసేందుకు దండుగులు యత్నించి విఫలమయ్యారు. ఎస్సై ఎండీ షరీఫ్ క్లూస్ టీమును రప్పించి ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు. పోలీస్ స్టేషన్‌కు సమీపంలో డిచ్‌పల్లి – నిజామాబాద్ ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న నగల దుకాణంలో చోరీ జరగడం కలకలం రేపింది. వరుస దొంగతనాలతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

షరతులు లేకుండా హామీలు అమలు చేయాలి



తాడ్వాయిలో తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న బీజేపీ కిసాన్ మోర్చా నాయకులు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): కాంగ్రెస్ పార్టీ రైతులకు ఇచ్చిన హామీలన్నింటినీ ఎటువంటి షరతులు లేకుండా అమలుపర్చాలని కిసాన్ మోర్చా నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం తాడ్వాయి పాతబస్టాండ్ నుంచి తహసీల్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లారు. కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ రహీమొద్దీన్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. నాయకులు రవీందర్‌రెడ్డి, రవీందర్‌రావు, సంతోష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నిజాంసాగర్(జుక్కల్): మద్నూర్ మండల కేంద్రంలో తహసీల్దార్ ముజీబ్‌కు బీజేపీ కిసాన్ మోర్చా నాయకులు వినతి పత్రం అందజేశారు. అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా సీఎం రేవంత్‌రెడ్డి ఆరు గ్యారంటీలను అమలు చేయకపోవడం సిగ్గుచేటని నేతలు విమర్శించారు. నాయకులు యాదవ్‌రావ్, తుకారాం, సుభాష్, రాజుసేట్ తదితరులున్నారు.

భిక్కనూరు: బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో తహసీల్దార్ శివప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా అధ్యక్షుడు సందుగారి జైపాల్‌రెడ్డి, మండల బీజేపీ అధ్యక్షుడు ఉప్పరి రమేష్, ప్రధాన కార్యదర్శి తిరుమలేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు రెడ్డిగారి రమేశ్‌రెడ్డి, మండల మహిళా విభాగం అధ్యక్షురాలు లక్ష్మి, నేతలు లింగారెడ్డి, ప్రమీల, తదితరులున్నారు.

కల్యాణ లక్ష్మి, సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న ఏఎంసీ చైర్మన్ మనోజ్

పిట్లం(జుక్కల్): స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం వద్ద శుక్రవారం లబ్ధిదారులకు మార్కెట్ కమిటీ చైర్మన్ మనోజ్ కుమార్ సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ..పేద కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు.

రాజంపేట: రాజంపేట మండలం ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని గుండారం, ఆర్గొండ, కొండాపూర్, అన్నారం, ఎల్లారెడ్డిపల్లి తదితర గ్రామాల లబ్ధిదారులకు శుక్రవారం కల్యాణ లక్ష్మి , సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేసినట్లు మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రణీత్‌రెడ్డి తెలిపారు. నాయకులు సల్మాన్, బీమరి శ్యామయ్య, శ్రీధర్, బన్సీలాల్, సాయగౌడ్, బాలరాజు, ఆర్‌ఐ లక్ష్మయ్య, తదితరుల్లున్నారు.

నిజాంసాగర్(జుక్కల్): మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద శుక్రవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మల్లికార్జున్ చేతుల మీదుగా ఒడ్డేపల్లి, బంజపల్లి, సుల్తాన్‌నగర్ గ్రామాల లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. నాయకులు అనీస్, రాము రాథోడ్, రమేష్ తదితరులు ఉన్నారు.

ఎల్‌వోసీ చెక్ అందజేత

గాంధారి(ఎల్లారెడ్డి): పోతంగల్ కలాన్ గ్రామానికి చెందిన సీతాయిపల్లి సాయిలు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలిసి ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఎమ్మెల్సీ కవితతో మాట్లాడి సహాయం చేయాలని కోరారు. దీంతో ఎమ్మెల్సీ కవిత నిధుల నుంచి రూ.1.50 లక్షలు మంజూరు చేయించారు. గాంధారి ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ రెడ్డి రాజు, నాగ్లూర్ సాయిలు శుక్రవారం నిమ్స్ ఆస్పత్రికి వెళ్లి సాయిలు కుటుంబ సభ్యులను పరమర్శించి ఎల్‌వోసి చెక్కును అందజేశారు.

తల్లి చనిపోయింది.. పినతల్లి బిచ్చమెత్తుకోమంది

- బాలికను బస్సెక్కించి ఊరి నుంచి పంపించేసిన ఇరుగుపొరుగు
- బోధన్ బస్టాండ్‌కు చేరుకున్న బాలిక.. స్వధార్ హోంకు తరలింపు

బోధన్‌టౌన్(బోధన్): కన్న తల్లి చనిపోయింది.. రెండో పెళ్లి చేసుకున్న నాన్న మానసిక స్థితి సరిగా లేక ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఒంటరైన ఆ బాలికను పినతల్లి బిచ్చమెత్తుకుని డబ్బులు తీసుకురావాలని వేధించింది. చిత్రహింసలు పడుతున్న ఆ బాలిక పరిస్థితిని చూస్తూ ఉండలేకపోయిన ఇరుగుపొరుగులు ఆమెను బస్సెక్కించి ఊళ్లో నుంచి పంపించేశారు. చివరకు అధికారుల సాయంతో ఆ బాలిక స్వధార్ హోంకు చేరుకుంది. ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. కోటగిరికి చెందిన సాయమ్మ అలియాస్ సావిత్రి (11) శుక్రవారం సాయంత్రం 6.30గంటల సమయంలో బోధన్ బస్టాండ్‌లో ఒంటరిగా కనిపించింది. గమనించిన లీగల్ సర్వీసెస్ అథారిటీ సిబ్బంది మహాలక్ష్మి పారా లీగల్ వలంటీర్ల(పీఎల్‌వీ)కు సమాచారం అందించగా అంగన్‌వాడీ టీచర్‌తో కలిసి బస్టాండ్‌కు చేరుకున్న పీఎల్‌వీలు ఎక్కడి నుంచి వచ్చావని బాలికను ప్రశ్నించగా.. తనది కోటగిరి అని, నాన్న పేరు పెంటెట్టి అని తెలిపింది. తన తల్లి చనిపోవడంతో తండ్రి మరో పెళ్లి చేసుకున్నాడని, మానసిక స్థితి దెబ్బతినడంతో ఇంటి నుంచి వెళ్లిపోయాడని వివరించింది. తండ్రి వెళ్లిపోయిన తరువాత పినతల్లి తనను చిత్రహింసలు పెట్టిందని, బిచ్చమెత్తి డబ్బులు తీసుకురావాలని వేధించిందని తెలిపింది. తన పరిస్థితిని చూసి చుట్టుపక్కల వారు బోధన్ బస్సు ఎక్కించడంతో ఇక్కడికి చేరుకున్నానని సమాధానమిచ్చింది. దీంతో పోలీసులు సహాయం తీసుకుని పీఎల్‌వీ ప్రతినిధులు పద్మసింగ్, రమణారెడ్డి బాలికను స్వధార్ హోంకు చేర్చారు.

అప్పుల బాధతో యువకుడి బలవన్మరణం



భరత్‌కుమార్(ఫైల్)

రాజంపేట: మండలంలోని ఆర్గొండ గ్రామానికి చెందిన చౌదరి రాజశేఖర్(27) అనే యువకుడు అప్పుల బాధ తాళలేక బలవన్మరణానికి పాల్పడ్డాడు. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. చౌదరి సిద్దరాములు చిన్న కుమారుడు చౌదరి రాజశేఖర్ గతంలోఉపాధి కోసం గల్ఫ్‌దేశాలకు వెళ్లి సరైన ఉపాధి లభించక ఇంటికి తిరిగి వచ్చేశాడు. ప్రస్తుతం హైదరాబాద్‌లో ప్రైవేటు జాబ్ చేస్తున్నాడు. సంక్రాంతి పండుగకు నాలుగు రోజుల క్రితం ఆర్గొండకు వచ్చాడు. ఆర్థిక సమస్యలపై పలుమార్లు కుటుంబ సభ్యులతో చర్చించిన రాజశేఖర్ గురువారం రాత్రి 10.30 గంటలకు పొలం వద్దకు వెళ్లి పడుకుంటానని ఇంట్లో వారికి చెప్పి వెళ్లాడు. ఉదయం ఇంటికి తిరిగి రాలేదు. రాజశేఖర్ బసవేశ్వర ఆలయ పరిధిలోని చెట్టుకు బెడ్‌షీట్‌తో ఉరేసుకుని కనిపించడంతో గ్రామానికి చెందిన తుల నరేశ్‌కు కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై సుభాషిణి తెలిపారు.


ఆర్థిక ఇబ్బందులతో విరక్తి చెంది..

దోమకొండ: మండల కేంద్రానికి చెందిన సామల భరత్‌కుమార్(34) గురువారం రాత్రి పురుగుల మందు తాగగా, చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు ఏఎస్సై సుబ్రమణ్యాచారి తెలిపారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందుతాగి భరత్‌కుమార్ పడిపోగా, కొద్ది సేపటి తరువాత కుటుంబసభ్యులు గమనించి అంబులెన్స్‌లో కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అక్కడికి నుంచి హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. ఇంట్లో ఆర్థిక సమస్యల కారణంగా జీవితంపై విరక్తి చెంది భరత్‌కుమార్ ఆత్మహత్య చేసుకున్నట్లు తండ్రి కృష్ణమూర్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఉరేసుకుని దయాలసిస్ పేషెంట్..

దోమకొండ: కిడ్నీలు చెడిపోయి దయాలసిస్ చేయించుకున్న వృద్ధుడు జీవితంపై విరక్తి చెంది ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండల కేంద్రానికి చెందిన గొర్ల చంద్రయ్య(63) గత కొంతకాలంగా కిడ్నీ సమస్యతో బాధపడుతూ దయాలసిస్ చేయించుకుంటున్నాడు. ఏడాదిగా ఎన్ని ఆస్పత్రులు తిరిగినా ఫలితం లేకపోవడంతో జీవితంపై విరక్తి చెందిన శుక్రవారం ఎవరూ లేని గొర్రెల కొట్టంలో ఉరేసుకున్నాడు. మృతుడి భార్య ఎల్లవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై సుబ్రహ్మణ్యాచారి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండలకేంద్రంలోని గోపాల్‌పేటలో శుక్రవారం చో టు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని మాసాన్‌పల్లికి చెందిన పెద్దఒంటరి శ్రీనివాస్‌రెడ్డి తన బైక్‌పై గోపాల్‌పేట నుంచి స్వగ్రామానికి బయల్దేరాడు. జప్తిజాన్కంపల్లికి చెందిన సొల్లు రాములు గోపాల్‌పేట వైపు వస్తుండగా అదే గ్రామానికి చెందిన తుమ్మ సమత లిఫ్ట్ అడగగా బైక్‌పై ఇద్దరు బయల్దేరారు. ఈ క్రమంలో గోపాల్‌పేట సమీపంలో శ్రీనివాస్‌రెడ్డి, రాములు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. శ్రీనివాస్‌రెడ్డి తలకు బలమైన గాయాలు కాగా, రాములు, సమత కాళ్లు విరిగాయి. సమాచారం అందుకున్న ఎస్సై మల్లారెడ్డి ఘటనాస్థలానికి చేరుకొని క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం మెదక్ ఆస్పత్రికి తరలించారు.

హత్య కేసులో నిందితుల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న అడిషనల్ డీసీపీ బస్వారెడ్డి

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ పట్టణంలో ఇటీవల జరిగిన మైలారం సోమేశ్ హత్య కేసులో నిందితులను అరెస్టు చేసినట్లు డీసీపీ బస్వారెడ్డి తెలిపారు. ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డితో కలిసి శుక్రవారం ఆర్మూర్ పోలీస్ స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. ప్లాస్టిక్ సామగ్రి ఏరుకుంటూ జీవిస్తున్న మైలారం సోమేశ్‌ను పట్టణంలోని సిద్దులగుట్ట వెనుక ప్రాంతంలో బుధవారం అర్ధరాత్రి దుండగులు కర్రలతో కొట్టి, కత్తెరతో పొడిచి హత్య చేశారన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు ప్లాస్టిక్ సామగ్రి ఏరుకుని జీవిస్తున్న కనపర్తి సత్యనారాయణ, కనపర్తి రాజు, బడే రవిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించారన్నారు. డబ్బుల విషయంలో గొడవ జరగడంతో హత్య చేశామని ఒప్పుకున్నారని డీసీపీ తెలిపారు.

■ వైన్‌షాపులో చోరీకి యత్నం కేసులో..

మామిడిపల్లి ప్రాంతంలోని 44వ నంబర్ జాతీయ రహదారి పక్కన ఉన్న లక్ష్మీనరసింహ వైన్‌షాపులో మూడు రోజుల క్రితం చోరీకి యత్నించిన ముగ్గురిని అరెస్టు చేసినట్లు డీసీపీ బస్వారెడ్డి తెలిపారు. ఆదిలాబాద్ జిల్లాకు చెందిన చౌహాన్ రవి, షేక్ షూబ్, గణేశ్ అనే ముగ్గురు ఈ నెల 8వ తేదీన కారులో వచ్చి చోరీకి యత్నించారన్నారు. అదే సమయంలో పెట్రోలింగ్ వాహనం రావడంతో పారిపోయే ప్రయత్నం చేయగా తమ సిబ్బంది వెంబడించి పట్టుకుని విచారించారన్నారు. బాల్కొండ, మెట్‌పల్లి, జగిత్యాల, కోరుట్ల, మమునూరు, ఇబ్రహీంపట్నం, మరిపెడ, డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్ల పరిధిలో చోరీలకు పాల్పడినట్లు నిందితులు అంగీకరించినట్లు తెలిపారు. నిందితులను అరెస్టు చేసి వారి నుంచి ఒక కారు, రెండు పల్సర్ బైక్‌లు, రూ.2 వేల నగదు, మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యం ప్రదర్శించిన సిబ్బందికి డీసీపీ రివార్డులు అందజేశారు. ఎస్‌హెచ్‌వో సత్య నారాయణ, ఎస్సైలు గోవింద్, మహేశ్, హెడ్ కానిస్టేబుల్ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.